# కవిత్రయభారతం_రాజనీతి

★

తెలుగు విశ్వవిద్యాలయంవారు నిర్వహించిన పోటీ
(1985-86)లో ఉత్తమ గ్రంథరచన
బహుమతి పొందిన గ్రంథం

★

డా॥ నేతి అనంతరామశాస్త్రి
రీడర్ - తెలుగుశాఖ,
నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జుననగర్.

నన్నయ నాటికి తూర్పుచాళుక్యుల యాధిపత్యం సుస్థిరమై, పరరాజులదాడులను, కుపానులనుండి విముక్తి పొంది. రాజరాజనరేంద్రుడు అంతఃకలహాలుకాని పెరవారి భయంగాని లేక నలభై సంవత్సరాలు శాంతియుతంగా రాజ్యం చేశాడు

ఆ విధంగా చాళుక్యుల అధికారం వ్రేళ్ళుదారి దేశం ప్రశాంతంగా ఉన్న రోజుల్లో నన్నయ భారతాంధ్రీకరణకు పూనుకున్నాడు. భారతాన్ని బహుభాషల బహువిధముల బహుజనములవల్ల వింటూ తృప్తిపొందలేక పోయాడు. కాబట్టే రాజరాజేంద్రుడు 'తెనుఁగున రచింపు మధికధీయుక్తి మెయిన్' అన్నాడు

చాళుక్య యుగంలోని శాసనాల్నిబట్టీ, నన్నయ భారతంలోని అవతారికనుబట్టీ ఆశ్వాసాంతపద్యాల్నిబట్టీ గ్రంథంలో అక్కడక్కడ స్వతంత్రంగా వ్రాసినభాగాల్నిబట్టీ నాటి సాంఘిక రాజకీయ, మతపరిస్థితులను కొంతవరకు తెలిసికోవచ్చు.

## ౧. ౧. ౨. నన్నయ - రాజ్యతంత్ర విజ్ఞానం :

రాజ్యతంత్ర విజ్ఞానం ప్రకటించే స్థలాల్లో నన్నయ అసాధారణ ప్రజ్ఞ ప్రదర్శించాడు

మయసభాప్రవిష్టుడైన ధర్మరాజును చూచి నారదుడడిగిన ప్రశ్నల్లో అద్వితీయ రాజకీయ ప్రతిభ గోచరిస్తున్నది అందును సంస్కృత మూలంలో సంగ్రహంగా అంటివిడిచిన ముఖ్యాంశాలను తెలుగు ప్రజల మేలుగోరి నన్నయ ఎంతచక్కగా వివరించి వ్రాశాడో పాఠకులకు చెప్పటం అత్యావశ్యం. ఉదాహరణకు .

1 'బలాబలేన సమ్యక్ త్వం చతుర్దశ పరీక్షసే' (2 5 22)

అని మాత్రం సంస్కృతమూలంలో ఉంది. రాజదోషాలు పదునాల్గు ఏవేవో చెప్పక ఆ దోషాలసంఖ్య పదునాల్గనిమాత్రం మూలంలో చెప్పబడింది.

రాజరాజనరేంద్రుడు

'జననుత కృష్ణద్వైపాయన
ముని వృషభాభి హిత మహాభారత బ
ద్ధ నిరూపితార్థ మేర్పడఁ
దెనుఁగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్'[2]

---

2. ఆది. 1,16.

అని నన్నయను కోరి ఉన్నాడు. కాబట్టి నన్నయ ఇక్కడ పదునాలుగు సంఖ్యను ఉగ్గడించి ఊరకుండక ఆదోషాల నిట్లా వివరించి తెలిపాడు. 'నాస్తికంబ నృతంబు ప్రమాదం బాలస్యం బనర్థజ్ఞులతోడి చింతనంబు క్రోధంబు దీర్ఘచింత దీర్ఘసూత్రత యెఱుకగలవారి నెఱుంగమి యర్థంబులయందనర్థకచింత నిశ్చితకార్యంబులు సేయమి మంత్రంబుల రక్షింపమి శుభంబుల బ్రయోగింపమి విషయంబుల దగులుట యనం బరగిన పదునాలుగు రాజదోషంబుల బరిహరింతె' [3]

2. ఆంధ్రమహాభారతంకాలంనాటికి ప్రజాభిప్రాయ ప్రాముఖ్యం కొంతవరకు కోల్పోయి రాజుల ఆధిక్యం సుస్థాపితమయింది. సంస్కృత భారతంలో రాజుల వంశనామాలుకాని వారిపేర్లుగాని తరచుగా పేర్కొనబడవు. తరచుగా ప్రజలనామములు వినబడుతుంటాయి. కురువులు, పాంచాలురు, మాగధులు, యదువృష్ణి, భోజులు, వంగకళింగ కాశ్మీర కాంభోజ గాంధారాంధ్రులు -ఈ ప్రకారం రాజులు తాము పరిపాలించు ప్రజల నామాలచే తెలియబడుతుండేవారు.

రాజరాజ నరేంద్రుడు ఉత్తమ చాళుక్యుడు. విమలాదిత్య తనూజుడు రాజమహేంద్రుడు అని నన్నయ సంబోధిస్తాడే కాని ఆంధ్రుల పేరుతో పిలవడు

3 మూలంలో పౌరుల కివ్వబడ్డ ప్రాముఖ్యాన్ని నన్నయ ఇవ్వకపోవడం చూస్తే ఆతనికాలంలో ప్రజాభిప్రాయాని కెంత విలువ ఉండేదో తెలుస్తున్నది. ఉదాహరణకు

పాండురాజు మునిశాపంవల్ల అరణ్యంలో ఉండాలని నిశ్చయించుకొని తన నిశ్చయాన్ని ధృతరాష్ట్రాదులకు వార్తను పంపుతూ —

"కౌసల్యా విదురః క్షత్తారాజాచ సహబంధుభిః
పౌరవృద్ధాశ్చయే తత్ర విలసంత్యస్మదాశ్రయాః" అని మూలంలో

ఉంటే నన్నయ 'హస్తినాపురంబునకుం జని నా తపోవృత్తి నునికి రాజునకు,సత్యవతీదేవికి, భీష్మునకు, విదురునకు వృద్ధ పురోహిత బ్రాహ్మణులకుం జెప్పి అని రచించాడు. పౌరవృద్ధులకును భృత్యులకును రాజు కబురు పెట్టుట రాజ గౌరవానికి విరుద్ధమని భావించి నన్నయ వారిని విడిచిపెట్టాడు.

4 ధర్మరాజును యువరాజుగా చేయాలని ధృతరాష్ట్రుడు ప్రజలయొక్క కోర్కెలనుకూడా మనసులో ఉంచుకున్నాడు. ధర్మరాజు సద్గుణాల్నిబట్టి అతన్ని యువరాజుగా చేసినట్లు మూలంలో ఉంటే

---

3. సభా. 1.56

'ధృతి స్థైర్యసహిష్ణుత్వాదు నృశంస్యాత్తథార్జవాత్
భృత్యానామనుకరపార్థం'—

నన్నయ 'ధృతరాష్ట్రుడు యుధిష్ఠిరు రాజ్యభార దురంధరునిగా నెఱింగి భీష్మ విదురులతో నాలోచించి యౌవరాజ్యాభిషిక్తుని జేసిన'.

నన్నయ కాలంలో యువరాజును చేయటానికి ప్రజాభిప్రాయమక్కరలేదు. రాజకుమారుడైనంతమాత్రంచేత యువరాజగుట సహజమని అతని అభిప్రాయం కావచ్చు.

5. రాజులను ప్రతిష్ఠించి తీసివేసే శక్తి పౌరులకున్నదికాబట్టే ఆ కాలపు ప్రజలు రాజులను తీవ్రంగా విమర్శించేవారు. ఏకచక్రపురవాసియైన పేదబ్రాహ్మణుడు బకాసురునికి ఆహారంగా పంపటానికి తనవంతు వచ్చినపుడు శోకిస్తూ రాజు నిట్లా నిందించాడు.

'వేత్రకీయే గృహే రాజానాయం నయమిహాసితం
ఉపాయం తం న కురుతే యత్నాదపి నమంద్రధీః
అనామయం జనస్యాస్యయే నస్యాదద్యశాశ్వతమ్
ఏతదర్హావయం నూనం వసామోదుర్బలస్యయే'

కాబట్టి, 'రాజానం ప్రథమం విందేత్' అని అంటున్నాడు రాజు తన ఇంట్లో కూర్చుని ఇవిచూడడు ఆ మందబుద్ధి ఉపాయాంతరాన్నైనా ఆలోచింపడు ఈ జన పదం ఈవిధంగా పీడనమైపోతుంది దుర్బలుడైనరాజుకింద మేమిట్లా అనుభవించటం సహజమే. కాబట్టి మొదట రాజును ఎన్నుకోవాలి' అని మూలంలో ఉంటే ఆంధ్రీకరణంలో 'ఈనాటి రాజును దలప దనుకనోర్వ బలిమి లేమి', అని ఉంది

రాజు ఉపేక్షపరుడైనా ప్రజలకు అతణ్ణి విమర్శించే అధికారం లేదని తలంచే నన్నయ ఇంత సంక్షిప్తంగా ఈ అంశాన్ని ముగించాడు.

6. పౌరులు తమ అధికారాన్ని గుర్తించి సభల్లోను, చతుష్పథాలయందు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చేవారు రాజును చెయ్యటానికి, వారిని సింహాసన భ్రష్టులను చేయటానికి వారికి అధికారం ఉన్నట్లు మూలభారతం వల్ల తెలుస్తున్నది కాని నన్నయకాలంనాటి ప్రజలు రాజులను సింహాసన మెక్కించటం పదభ్రష్టులను చేయటం తమ హక్కని ఎరుగరు. అందువల్లనే మూలంలో ఉన్న విషయాలు

భిన్నంగాను తన కాలానికనుగుణంగాను ఉన్న విషయాల్ని నన్నయ భారతంలో చొప్పించి తనకున్న రాజ్యతంత్ర విజ్ఞానాన్ని ప్రదర్శించాడు

## ౧.౨.౧. తిక్కన - మత రాజకీయపరిస్థితులు :

నన్నయ తరువాత తిక్కన మళ్ళీ మహాభారతాంధ్రీకరణాన్ని చేపట్టటానికి సుమారు రెండు శతాబ్దాలకాలం పట్టింది. ఇంత దీర్ఘ వ్యవధానం కలగటానికి దేశంలో అప్పుడేర్పడ్డ రాజకీయ మత సాంఘిక పరిస్థితులే కారణం. అప్పుడాంధ్ర దేశంలో వీరశైవమత మొకవంక వ్యాప్తిచెందుతుంటే యింకొకవంక విశిష్టాద్వైత మతం వ్యాపింప ఆరంభించింది.

వీరశైవమతం వేదప్రామాణ్యాన్ని వేదోక్తకర్మలను అంగీకరించదు. అందువల్ల తన్మతానుయాయులు వేదధర్మ ప్రచారకమైన భారతాన్ని ఆంధ్రీకరించలేదు. వైష్ణవులు వీరశైవుల్లాగా వేదప్రామాణ్యానికి విరుద్ధులు కాకపోయినప్పటికీ స్వమత సిద్ధాంత ప్రచారకమైన గ్రంథాల్ని వ్రాశారు.

తిక్కన మొదట మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుడే అతని శివభక్తి వీరశైవ మతానుయాయుల శివభక్తివలె విష్ణుదూషణ పరాయణమై ముదురుపాకంలో పడ్డది కాదు. శివకేశవులను ఇంచుమించు సమభావంతో కొలిచేవాడు. కాబట్టే తిక్కన హరిహరనాథ ఆరాధకుడయ్యాడు.

తిక్కన చిన్నతనంలోనే తల్లిదండ్రులు దివంగతులవటంతో నెల్లూరులో మంత్రిపదవిలో ఉన్న పెదతండ్రి సిద్ధనామాత్యుని దగ్గర విద్యాబుద్ధులు నేర్చుకున్నాడని చెప్తారు ఆకాలంలో వేదవేదాంగాలతోపాటు మనుమసిద్ధికి సహపాఠియై రాజనీతిని కూడా అభ్యసించి ఉంటాడు కేతన దశకుమారచరిత్రలో తిక్కననుగూర్చి వాడిన 'సామాద్యుపాయవిదుడు, రాజనయవిధాప్రయోజన విశారదుడు, నరపతినయ విద్యా నైపుణ్య ప్రౌఢభావుడు. నీతి చాణక్యుడు' మున్నగు విశేషణాలు ఈ విషయాన్ని బలపరుస్తున్నవి. వయసులో తిక్కన మనుమసిద్ధితో సమానుడో లేని కొంచెం పెద్దవాడో అయివుంటాడు. మనుమసిద్ధి అతన్ని వరుసకు మామా అని పిలుస్తుండేవాడని నిర్వచనోత్తర రామాయణంలో చెప్పబడి ఉండటంచేత అతడు కొంచెం పెద్దవాడై ఉంటాడని ఊహింపవచ్చు. తిక్కరాజు మరణానంతరం మనుమసిద్ధి రాజ్యాభిషిక్తుడుకాగానే తిక్కన .మంత్రిపదవి నధిష్ఠించి ఉంటాడు